# ‘బాతాఖానీ’

శ్రీమతి డి. యస్. రాజేశ్వరీ పట్నాయక్

[స్త్రీ విద్యాభివృద్ధిని సూచిస్తున్న ఈ రోజుల్లో బాలికల వివాహ సమస్య ఒక అగ్ని పరీక్షకు గురియైపోతోంది. బాసి సత్వానికి నలిగిపోయి బాల్య వివాహాలవలన అనుకోని విపత్తుల కాహుతయిపోయిన వేలకొలది స్త్రీల జీవిత సమస్యల్ని కడతేర్చే అంతస్సును నేటి విద్యావతి పరిష్కరిస్తుందా!!! వివాహాల్లో ఈ విచిత్రం చదవండి.] —రా. ప.

[డాక్టరుగారి బంగళా: డాక్టరు భార్య సుభద్ర హాల్లో పుస్తకం చదువుకుంటూండగా పరిచితురాలు కనకం ప్రవేశం]

సు: “ఓ, హో, కనకం...ఎన్నాళ్లకెన్నాళ్లకు! ఈ మధ్య రావడమే మానేశావే, విశేషాలేమిటి?”

క: “ఆఁ...ఏమీలేదమ్మా, పనుల తొందర్లలో రాలేక పోయాను అందరూ కులాసాయేనా?”

సు: “ఏమికులాసా, కనకం, పెళ్లీడుకొచ్చిన అమ్మాయి. హృదయానికి సమ్మెట పోటువలె కృంగిపోతున్నాం తగిన సంబంధాలు కలిసిరాక”

క: “మీలాంటివాళ్లకు సంబంధాల కొదువేమిటమ్మా. పిల్ల కాస్త ఛాయతక్కువైనా మొహం కళకళ్లాతుంది. కాస్త ధనాశచూపితే డిగ్రీలన్నీ మీగుమ్మాన్నే కాస్తాయి”

సు: ఆ డిగ్రీల లిస్టుకోసమే యిన్నాళ్లూ అమ్మాయికి కళ్యాణ యోగం పట్టలేదు”

క: “విచారించకండమ్మా, కక్కొచ్చినా కళ్యాణమొచ్చినా ఆగదంటారు పెద్దలు. అయినా ప్రయత్నిస్తే కలిసిరాక పోతుందా. మన వూళ్లోనే లెక్చరర్ గారి అబ్బాయిని గూర్చి వినేవుంటారు. అబ్బాయి చక్కనివాడు, మంచి విద్యావంతుడు. ఏదో పెద్దవుద్యోగం చేస్తున్నాట్ట కూడా. ఆ అబ్బాయికి ఒక చెల్లె వుంది. మీరు కాస్త సూచనచేస్తే వాళ్లింటికెళ్లి భోగాట్టా చేస్తా.”

సు: “హమ్మయ్యో...వాళ్లకు కట్నాలదాహం విపరీతంగా వుందని విన్నానే. 5000 వేల కట్నంతోపైగా తీరని కోరికలన్నీ లాంఛనాల రూపంగా ముట్టజెప్పాలట. మనకు సాధ్యమా కనకం?”

క: “తలోకవిధంగా అనుకుంటారు. నేను వెళ్లి కాస్త కదిపి చూపితే వాళ్లవుద్దేశాలెలావుంటాయో తెలుసుకోవచ్చు. నచ్చని వాళ్లు కిట్టని వాళ్లుచేసిన ప్రచారాలు మనం నమ్మాలిసిందేనా?”

సు: “సరే, ప్రయత్నించి చూడు, కాని మేమే ముందుగా వాళ్లబ్బాయిని కోరినట్లుమాత్రం వాళ్లకు తెలియకూడదు సుమా.”

క: “అబ్బే, అలా గెందుకవుతుందీ నాకు మాత్రం తెలియదూ. వెళ్లొస్తానమ్మా.”

* * *

[ఒక మాజీ ముద్రాధికారియిల్లు: అతని భార్య అన్నపూర్ణ, లెక్చరర్ భార్య సుందరమ్మ ప్రవేశం]

అన్న: సుందరమ్మగారూ, మీ అమ్మాయిని మా అబ్బాయికి చేసుకోడానికేమీ అభ్యంతరం లేదుగాని ఇంగ్లండు వెళ్లి పరీక్షలు పాసయి వచ్చిన అబ్బాయికి నా యిష్టమైన అమ్మాయిని ముడిపెట్టడమంటే నాలోనుందా? అబ్బాయి యిష్టా ఇష్టాలు తెలుసుకొని మీకు తెలియ జేస్తా.”

* * *

[ఉపహారాల పళ్లెంతో కనకం ప్రవేశం]

సుం: ఎవరూ...కనకం! యెన్నాళ్లకొనుపించావే! ఏదో పంచిపెడుతున్నట్టున్నావు ఏమిటి విశేషం?”

క : "మీయింటి కెన్నాళ్ళయ్యో రావాలనుకుంటున్నా రాలేక పోతున్నాను సుందరమ్మగారూ. యిక్కడే మీ దర్శనం అయింది. అమ్మా, పళ్లెం అందుకోండి. డాక్టరు సర్వభద్రరావుగారి అమ్మాయి పుట్టినదినం ఈ వేళ."

సుం : "వెళ్లొస్తానండీ అన్నపూర్ణమ్మగారూ. ఆలోచించి పర్యవసానం తెలుపండి."

క : "నేనూ మీయింటివైపే వస్తున్నాపదండి సుందరమ్మగారూ."

* * *

[లెక్చెరర్ గారింట్లో, సుందరమ్మ, కనకం ప్రవేశం]

క : "మన అబ్బాయి కెక్కడన్నా పిల్లను చూచారా సుందరమ్మగారు"

సుం : "లేదమ్మా, యింజనీరింగ్ చదువుచున్న అబ్బాయికి పిల్లలకొరతేమిటిగాని అమ్మాయి సంబంధానికే అవస్థలు పడుతున్నాం. మన హోదాకు తగిన సంబంధం కలిసి రాకుండావుంది. పిల్లకు S. S. L. C. చదివించాం, ఫిడీలుకూడా నేర్పిస్తున్నాం. దాని చదువుకి కాస్తపై డిగ్రీలోనున్న వాడన్నా సమకూడాలా ?"

క : "అయ్యో, ఎంతమాట, అంత చదువుకున్న పిల్లకు మంచి సంబంధానికే ప్రయత్నించాలి."

సుం : నీకు తెల్సిన సంబంధాలెక్కడైనా వున్నాయా కనకం?

క : మీకు తెలియని సంబంధాలంటూ వున్నాయామ్మా? పోనీ డాక్టర్ సర్వభద్రరావుగారి అబ్బాయికి మాట్లాడితే బాగుండునేమో. వాళ్లమ్మాయికి మీ అబ్బాయికి చేసుకోండి యెదురు బొదురు సంబంధాలు చక్కగా కలిసొస్తాయి.

సుం : చూడు కనకం, నీవెంతో ఆత్మీయురాలవని నీతో చెప్తున్నా. వాళ్లమ్మాయిని మా అబ్బాయి యిష్టపడడమ్మా. మన అమ్మాయిగురించే ఒకసారి వాళ్లింటికి వెళ్లాను ఈ మాట యెవరి చెవినివేయకేం!

క : "మంచిది మీకెలాగ తోస్తే అలాగే చేయండి,"మరినే వెళ్తా.

* * *

[డాక్టరుగారియిల్లు, సుభద్ర, సుందరమ్మ ప్రవేశం]

సుం : "అయితే, అబ్బాయి పెండ్లి ప్రయత్నాలేమీ తలపెట్టలేదా సుభద్రమ్మగారూ,"

సుభ : అబ్బాయికి తొందరేమొచ్చిందమ్మా! అమ్మాయికి సంబంధం కలిసివస్తే తరువాత ఆలోచించుకోవచ్చు. అబ్బాయికి ఇరవయ్యో ఏడేగదూ. ఎన్నేళ్లొచ్చినా మగవాడి కెంచే దేమున్నది గనక !"

సుం : "అమ్మాయి కెక్కడన్నా సంబంధం స్థిరపడిందా ?"

సుభ : "మాటల్లోనే వుందిటలే, దైవఘటన యేలాగుందో."

సుం : "సరే, యింకేం, మీ అబ్బాయికి మా అమ్మాయిని చేసుకోండి"

సుభ : అబ్బాయికి తొందర లేదమ్మా. వాడికిష్టమైనప్పుడే చేసుకుంటాడట. తరువాత ఆలోచించుకోవచ్చు.

సుం : పోనీ, మీరోసారి మాయింటికి రండి, అమ్మాయిని చూద్దురుగాని.

సుభ : "అలాగే, దానికేంభాగ్యం వస్తాలెండి"

* * *

[డాక్టరుగారింట్లో, సుభద్ర, కనకం ప్రవేశం]

సుభ : "చూశావా కనకం, వివాహ విచిత్రాలెలా పరిణమించాయో,"

క : "ఇంతకూ ఏ సంబంధం స్థిరమవనట్టేనా సుభద్రమ్మగారూ,"

సుభ : స్థిరమూలేదూ చింతాలేదు. పాడు సంబంధాలు ఆడవాళ్లల్లో ధనతృష్ణ మితిమీరి పోతోంది. అన్నపూర్ణగారి హోదాకు 5000 కట్నం, రేడియో సెట్టు, రిష్టువాచీ...యింకా గొంతెమ్మకోరికలన్నీ యిస్తామని బ్రతిమాలుతున్నారట. ఇంక లెక్చెరర్ గారి సంగతి వాళ్లమ్మాయిని మనంచేసుకోవాలిగాని మన పిల్లను వాళ్లు చేసుకోరట చూశావా ? వీళ్లవింత ప్రవృత్తులు !

క : మొన్న మీనాక్షిగారింట్లో ఈ ప్రస్తాపనరాగా పెద్దగా నవ్వింది మీన, వాళ్ల మాయలకు లోనయ్యారా ? అని. ఒకసారి ఇంటర్ చదువుచున్న అమ్మాయి తండ్రి వచ్చి

మా పిల్లను చేసుకోండి అన్నాడట. అందుకు అన్న పూర్ణగారు “ ఈ సంవత్సరంతో మీ అమ్మాయి చదువు మాన్పించేయండి వచ్చేయేడు పెళ్లిచేద్దాం ” అంటూ నమ్మించి సాగనంపిందట. తీరా పెండ్లి ముహూర్తమెప్పు డని ఆ బిడ్డ తండ్రి పదేపదేవచ్చి అడుగుతూంటే మా అబ్బాయికి మీ పిల్ల నచ్చలేదని నిర్మొగమాటంగా చెప్పేసిందట పాపం! ఆ అమ్మాయి పెండ్లీ అవక, చదువూ సాగక రెండిటికి చెడిందట. “ ఇంటింటా మట్టి పొయ్యి మా యింట్లో మరొకపొయ్యి ” అన్నట్టు పై పిల్లల అంద చందాలు వెక్కిరిస్తున్న ఈ రెండు ఇళ్లల్లోనూ అందవిహీనులైన పెళ్లీడువచ్చిన పిల్లలున్నారు. ఈ కారణాలచే, తమ మగపిల్లల కట్నాల ధరలు బ్లాక్ మార్కెట్లు ధరవలె నిలవేస్తూ ఏ పిల్ల తండ్రైనా పిల్లనిస్తామని వస్తే తమ పిల్లలకుకూడా మంచి సంబంధాలు చూచిపెట్టి వాళ్లకోరిన కట్నాలు సమర్పిస్తే మీ అమ్మాయిని మా అబ్బాయికి చేసుకుంటా మంటారట !”

సు : “ చాలా బాగుంది ఈ వ్యాపారలక్షణం. ఇంతకు ఈ మూర్ఖతాలు స్త్రీజాతిలో నశించలేదంటే అవిద్యయే కారణమంటాను. ఉన్నత విద్యలభ్యసించిన యువకుల్లోనే చిత్తసంస్కారము కలుగనప్పుడు విద్యావిజ్ఞానాలకు దూరమైయున్న స్త్రీల మూర్ఖత్వానికి అంతులేక పోవడం ఆశ్చర్యంలేదు. యుగసంధినున్న బాలికల నుద్ధరించాలంటే విద్యావతులగు స్త్రీలందరూ ఆందోళన చేసి శారదా చట్టమువలె వరకట్న దురాచారాన్ని చట్టబద్ధము చేయించినగాని స్త్రీలలో పరివర్తన గలుగదేమో.”

★


# రీటా హెయిర్ టానిక్

## తల వెంట్రుకలను పెంచును



రీటా కుదుళ్లకు బలమునిచ్చి, నిగనిగలాడు నిడుపాటి వెంట్రుకలను పెంచుటకు అద్భుతమైన హెయిర్ టానిక్.

తల వెంట్రుకలు రాలుట, నెరయుట, చుండ్రు, బట్టతల, పేను కొరుకు, ఇంకను తల వెంట్రుకలకు సంబంధించిన సమస్త వ్యాధులకు రీటా అమోఘముగ పనిచేయును. వేలకువేలువాడి గుణమును పొందియున్నారు. మీరుకూడ నేటినుండియే రీటా వాడుడు. రీటా హిందూ దేశమంతటా దొరకును.

వెల సీసా 15 అణాలు.

**RITA**

**HAIR TONIC**

